క్లుప్తంగా

తాండ్రకుమార్ ఆశయ సాధనకు కృషి చేయాలి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ : భూమి కోసం, ఇంటి స్థలం కోసం, ఇళ్ల నిర్మాణం కోసం ప్రజల పక్షాన పోరాటాలు చేసిన నాయకుడు తాండ్రకుమార్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తాండ్రకుమార్ 3వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వస్కుల సైదమ్మ, కాశీ, భరత్, కిరణ్, జ్యోతి, కార్తీక్, సందీప్, కమలమ్మ, రవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీల నిర్వహణలకు నిధులివ్వాలని వినతి

అడవిదేవులపల్లి : గ్రామ పంచాయతీలకు గత ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, ప్రస్తుతం గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని మండలంలోని పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈమేరకు సోమవారం అడవిదేవులపల్లి ఎంపీడీఓ రమేష్, సూపరింటెండెంట్ అమీర్‌అలీకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పంచాయతీల్లో ట్రాక్టర్లకు డిజిల్‌తో పాటు పారిశుద్ధ్య కార్మికులకు కూడా వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే మార్చి 1వ తేదీ నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ కష్టమేనని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వివిధ గ్రామాల కార్యదర్శులు దుర్గయ్య, నర్సింహామూర్తి, ప్రవీణ్, ప్రభాకర్, శ్రీను, నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

భూమిలేని పేదలకు రూ.12వేలు అందించాలి

కొండమల్లేపల్లి: ఉపాధి జాబ్ కార్డుతో సంబంధం లేకుండా భూమిలేని పేదలందరికీ ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికుల స్థితిగతులను తెలుసుకుని మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలాలు, నూతన రేషన్‌కార్డులు, పెన్షన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వీటన్నింటిని వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కావలి కృష్ణయ్య, కూలీలు కూర ఈదమ్మ, కె.లక్ష్మయ్య, కడారి నారయ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

దేవరకొండ: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. దేవరకొండ మండలం తాటికోల్ వాగు, పెద్దతండాల నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా ట్రాక్టర్లు తిరిగే దారులను సోమవారం జేసీబీలతో తాత్కాలికంగా మూసి వేయించారు. ఈ సందర్భగా సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వాగులు, చెరువుల నుంచి ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అవసరం ఉన్నవారు ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే తీసుకోవాలని సూచించారు.

సాగర్ వెనుక జలాల్లో వ్యక్తి గల్లంతు

చందంపేట: సాగర్ వెనుక జలాల్లో పడి వ్యక్తి గల్లంతయ్యాడు. ఇన్‌చార్జి ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ గౌసొద్దీన్(27) ఆదివారం ముగ్గురు స్నేహితులతో కలిసి నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీ వద్దకు వచ్చాడు. వైజాక్ కాలనీ సమీపంలో సాగర్ వెనుక జలాల్లో మర బోటులో విహరిస్తుండగా.. గౌసొద్దీన్ సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు సాగర్ వెనుక జలాల్లో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండడంతో సోమవారం కూడా గౌసొద్దీన్ ఆచూకీ లభ్యం కాలేదు. గౌసొద్దీన్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

చోరీకి యత్నించిన కేసులో వ్యక్తికి ఏడాది జైలు

చిన్నగూడూరు: మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి శివారు దేవోజీతండాలో ఓ ఇంట్లో చోరీకి యత్నించిన కేసులో నిందితుడికి తొర్రూరు మేజిస్ట్రేట్ మట్ట సరిత ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై రూప్సీ తెలిపారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తేనెపల్లికి చెందిన శివర్ల కోటేష్ 2023లో దేవోజీతండాకు చెందిన ధర్మసోత్ భూపాల్‌నాయక్ ఇంట్లో చోరీకి యత్నించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కోటేష్‌పై కేసు నమోదు చేశారు. సోమవారం కేసు విచారణ అనంతరం తొర్రూరు మేజిస్ట్రేట్ మట్ట సరిత.. నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు.

కంకర తేలి.. అధ్వానంగా మారి!

- ధ్వంసమవుతున్న గ్రామీణ రోడ్లు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు
- ఆందోళనలో తిరుమలగిరి సాగర్ మండల ప్రజలు



కంకరతేలి అధ్వానంగా ఉన్న చక్కోలం - పిల్లిగుండ్లతండా రోడ్డు



గుంతలమయంగా మారిన నేతాపురం- దొక్కలబావితండా రోడ్డు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి, గుంతలమయంగా తయారై అధ్వానంగా మారాయి. ఆయా రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. దొక్కలబావితండా–నేతాపురం రోడ్డు మరమ్మతులకు గురైంది. మిర్యాలగూడ పట్టణంతోపాటు, నిడమనూరు మండలంలో కోటమైసమ్మ, దామరచర్ల మండలంలో బంగారు మైసమ్మ దేవస్థానాలకు వెళ్లాలంటే ఈ దారిగుండా వెళ్లాల్సి ఉంటుంది. దొక్కలబావితండా, రాజవరం, బోయగూడెం, గర్కనట్‌తండా, జెవ్విచెట్టుతండా, తునికినూతల, కిచ్యతండా, నాయకునితండా, తిమ్మయ్యపాలెంతోపాటు వివిధ గ్రామాల ప్రజలు మిర్యాలగూడ వెళ్లాలంటే ఈ రోడ్డే ప్రధాన రహదారి. ఈ రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో తిరుమలగిరి మండల కేంద్రం మీదుగా హాలియా నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ప్రస్తుతం మిర్చీ కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో ఆయకట్టు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే ఆటోల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రివేళ ఈ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా కోకొల్లలుగా ఉన్నాయి.

యల్లాపురంతండా, పిల్లిగుండ్లతండా రోడ్లదీ అదే పరిస్థితి

మండలంలోని యల్లాపురంతండా నుంచి పిల్లిగుండ్లతండాకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని కంకరతేలి ఉంది. చింతలపాలెం, గోడుమడక, నెల్లికల్లు, ఎర్రచెరువుతండా, జాల్‌తండా, బట్టువెంకన్నబావి తండా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఈ దారి గుండానే రావాలి. దీంతో పాటు నాగార్జునసాగర్‌కు వెళ్లే వారు కూడా ఈ దారిగుండానే వెళ్తారు. అలాగే కొంపల్లి నుంచి సుంకిశాలతండాకు వెళ్లే రహదారి కూడా పూర్తిగా కంకరతేలి ప్రమాదకరంగా మారి ఏళ్లు గడుస్తున్నా.. సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



దొక్కలబావితండా, నేతాపురం రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. మిర్యాలగూడ వంటి పట్టణాలకు వెళ్లాలంటే ఈ దారి మాకు చాలా దగ్గరగా ఉంటుంది. ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలి.
– గడ్డమీది నాగార్జున్, రాజవరం

ప్రమాదాలకు గురవుతున్నాం



యల్లాపురంతండా, పిల్లిగుండ్లతండా రోడ్డు కంకరతేలి అధ్వానంగా ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరవుతున్నాం. గత కొన్ని సంవత్సరాలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించాలి.
– కుర్ర నాగేశ్వరావు నాయక్, చక్కోలంతండా

ఘనంగా శ్రీకనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భార్గవ్, నాగలక్ష్మి దంపతులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని గాంధీనగర్‌లో గల శ్రీకనకదుర్గ ఆలయ 25వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాగలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి 108 కలశాల పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కన్నెగుండ్ల రంగయ్య, అల్లాని రమేష్, గోళ్ల రాంశేఖర్, ఏచూరి నాగేశ్వర్‌రావు, దుర్గాభవాని, శంకర్, రేపాల లక్ష్మీకాంతం గుప్తా, వీడియాల నాగేశ్వర్‌రావు, సుధాకర్, మట్టయ్య, రవి, రమేష్ తదితరులు ఉన్నారు.

టీబీ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



పీహెచ్‌సీలో సీబీటీ వ్యాక్సిన్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

త్రిపురారం: టీబీ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతా వాణి అన్నారు. త్రిపురారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బందికి సీబీటీ వ్యాక్సిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీబీటీ వ్యాక్సిన్ పరీక్షలు చేయడం వల్ల సీబీటీ వ్యాక్సిన్ ఇచ్చిన ప్రాంతంలో దద్దుర్లు వస్తాయని, దీంతో వ్యాధి ఉన్నట్లు కనిపిస్తుందని తెలిపారు. ప్రైమరీ యాంటీ టీబీ మందులు వాడి తగ్గించుకోవచ్చని చెప్పారు. మొదట హెల్త్ సిబ్బంది ఆశా కార్యకర్తలకు సీబీటీ పరీక్షలు చేసి తరువాత మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలందరికీ సీబీటీ టెస్టులు చేస్తామన్నారు. కార్యక్రమంలో త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, వెంకన్న, హెల్త్ అసిస్టెంట్ పుట్టా గోపాల్ రెడ్డి, ఆశా కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిర్యాలగూడటౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని చైతన్యనగర్‌లో గల సెయింట్ జాన్స్ స్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అధికారులుగా, రాజకీయ నేతలుగా వివిధ హోదాల్లో వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిండి: మండలంలోని చెర్కుపల్లి ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



స్వపరి పాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఫీజు బకాయిలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసేంతవరకు ఎస్‌ఎఫ్‌ఐ పోరాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ సూచించారు. సోమవారం మిర్యాలగూడలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,350 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఈనెల 19, 20 తేదీల్లో నల్లగొండలో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, శ్రీనునాయక్, కుర్ర సైదానాయక్, ముడావత్ జగన్, సూర్యకాంతి, ప్రసన్న, సంపత్, వీరన్న, చంటి, అఖిల్, బన్ని, చిన్న తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు.. విచారణ

దేవరకొండ: దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ గిరిజన గురుకుల బాలికల హాస్టల్‌లో ఆకతాయి చొరబడి కలకలం సృష్టించిన ఘటనపై పాఠశాల ఇన్‌చార్జి కవిత ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నర్సింహులు తెలిపారు. ఈ నెల 14న పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అదే రోజు తెల్లవారుజామున ఓ ఆకతాయి హాస్టల్‌లోకి చొరబడి విద్యార్థినులను భయాందోళనకు గురిచేశాడని వార్తలు రావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాలతో దేవరకొండ పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని సీఐ సూచించారు. అవసరమైతే రాత్రి పెట్రోలింగ్ పెంచుతామని ఆయన పేర్కొన్నారు.

ఎస్‌ఐ పేరిట ఫోన్ చేసి టోకరా

దేవరకొండ: ఎస్‌ఐ పేరిట మీ సేవా కేంద్రం నిర్వాహకుడికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి టోకరా వేశాడు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలో మీ సేవా కేంద్రం నిర్వహిస్తున్న జగపతిబాబుకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి 'నేను లోకల్ ఎస్‌ఐని మాట్లాడుతున్నా.. నాకు రూ.5వేలు అవసరం ఉన్నాయి.. మళ్లీ తిరిగి ఇస్తాను' అంటూ ఓ ఫోన్ పే నంబర్ చెప్పి దానికి డబ్బులు పంపమన్నాడు. ఇది నమ్మిన జగపతిబాబు ఆ వ్యక్తి చెప్పిన ఫోన్ నంబర్‌కి రూ.5వేలు ఫోన్ పే ద్వారా పంపించాడు. అదే రోజు సాయంత్రం తనకి వచ్చిన ఫోన్ నెంబర్‌కి కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో జగపతిబాబు తాను మోసపోయానని గ్రహించి సోమవారం దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు. ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

గుర్రంపోడు: విద్యుదాఘాతంతో యువ రైతు మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలంఆమలూరు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం .. ఆమలూరు గ్రామానికి చెందిన గుంజ భాస్కర్ (34) తన వ్యవసాయబావి వద్ద మోటారు స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో ఫ్యూజ్ పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య గుంజ సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దర కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ



జిల్లా ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థి రోహిత్‌రెడ్డి

హాలియా : సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 32వ సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ ఒలింపియాడ్‌లో వీఎస్‌ఆర్ స్కూల్ విద్యార్థి రోహిత్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య సోమవారం తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో రోహిత్‌రెడ్డికి అవార్డుతో పాటు మెరిట్ సర్టిఫికెట్, క్యాష్ ప్రైజును అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఓట్లడిగే అర్హత లేదు



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మిర్యాలగూడ : కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా, యువతను దేశాభివృద్ధిలో భాగం చేయకుండా ముందుకు పోలేమన్నారు. మోదీ ప్రధానమంత్రి అయ్యాక భారతదేశ ఖ్యాతి ప్రపంచ స్థాయికి ఎదిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం మోదీ చరిష్మాను గుర్తించి భారతదేశానికి సముచిత స్థానం ఇచ్చారని తెలిపారు. ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా ఉన్న జీఓ నంబర్ 317కు వ్యతిరేకంగా ఉద్యమించింది బీజేపీనే అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అలసత్వం వహిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, పాపారావు, సునీతారెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తంరెడ్డి, బంటు సైదులు, ఎడ్ల రమేష్, బంటు గిరి, హనుమంతరెడ్డి, అశోక్‌రెడ్డి, సీతారాంరెడ్డి, చిలుకూరి శ్యామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తుల్జాభవాని, మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న నోముల భగత్ యాదవ్

త్రిపురారం: మండలంలోని సత్యంపాడు తండా గ్రామ పంచాయతీ పరిధిలో తల్జాభవాని, మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ట్రికార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ దంపతులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 3000 మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడలు ప్రారంభిస్తున్న నవీన్ కుమార్

చింతపల్లి: యువకులు క్రీడల్లో రాణించాలని నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం చింతపల్లిలో ఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన పూరె రాములు స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను చింతపల్లి ఎస్‌ఐ భీమన మోని యాదయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. యువకుల్లో దాగిఉన్న క్రీడానైపుణాన్ని వెలికి తీయడానికి ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత చెడు వ్యసనాలకు, గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఆకారపు నరేష్

కొండమల్లేపల్లి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలోని శ్రీకాంతి జూనియర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన దేవరకొండ 7వ డివిజన్ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నల్లగొండలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జిల్లెల ఇద్ది రాములు, బుడిగ వెంకటేష్‌లతో పాటు 17 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, పాట్ల రాకేష్, జై చరణ్, యోగి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



వేములపల్లి : శెట్టిపాలెంలో మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



దేవరకొండ : మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



పీఏపల్లి : గుడిపల్లిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



అడవిదేవులపల్లిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



హాలియాలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

సంక్షిప్త సమాచారం

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలి

హాలియా: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేసేంత వరకూ ఎస్‌ఎఫ్‌ఐ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నాగార్జున సాగర్ డివిజన్ మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయలేకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 19, 20 తేదీల్లో నల్లగొండ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని ఈ సభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, రవినాయక్, కోరే రమేష్, నల్లబెల్లి జగదీష్, బుడిగపాక వర్షిత్, నవీన్, సాయి, కార్తీక్, శివ, చరణ్, అంజలి తదితరులున్నారు.

చలకుర్తి వాసికి బిజినెస్ ఇన్నోవేషన్ అవార్డు

పెద్దవూర: పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన పాతనబోయిన సంతోష్‌కుమార్‌కు తెలంగాణ బిజినెస్ ఇన్నోవేషన్ అవార్డు వరించింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని డిపార్క్ హోటల్‌లో టైకూన్ మీడియా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును సినీనటి భూమిక చావ్లా చేతులమీదుగా సంతోష్‌కుమార్ అందుకున్నారు. సంతోష్‌కుమార్ ఏడీఎంఎస్ ఈ–బైక్స్ తెలంగాణ డిస్ట్రిబ్యూటర్‌గా ఉంటూ, ఎలక్ట్రానిక్ వాహనాల ఆవశ్యకతను తెలియజేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అనతికాలంలోనే రాష్ట్రం నలుమూలలా 100కు పైగా షోరూంలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని, నూతనంగా వ్యాపార రంగంలో అడుగుపెట్టే యువతకు ఆదర్శంగా ఉంటుందన్నారు.

42శాతం రిజర్వేషన్ కల్పించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం ఇచ్చే విధంగా చూడాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో ఈడిగ శ్రీనివాస్, బూర శ్రీనివాస్, గోదా రవీందర్ తదితరులున్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

దేవరకొండ: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని సోమవారం దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పృథ్వీ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.